

వైభవంగా
శ్రావణమాస బోనాలు

దుండిగల్‌లోని రాజరాజేశ్వరి పోచమ్మ దేవాలయంలో శ్రావణమాస బోనాలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఒడి బియ్యం పోశారు. అనంతరం సాయంత్రం బోనాలను సమర్పించారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణలతో పాటు పలువురు అమ్మవారిని దర్శించుకున్నారు. – దుండిగల్



అలంకరణలో రాజరాజేశ్వరి పోచమ్మతల్లి



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



పూజల్లో పాల్గొన్న కొలన్ హన్మంత్‌రెడ్డి

మాఫీ మాయ!

రూ. 3.56 కోట్ల రుణాలకు రూ.35 లక్షలే మాఫీ!



వడ్లు నానబెట్టి.. దుక్కి దున్ని.. నారు పెట్టి.. కలుపు తీసి.. కోతకు వచ్చిన వరి పంట చేతికి రావాలంటే సుమారు నాలుగు నెలల సమయం పడుతుంది. అతి వృష్టి.. అనా వృష్టి సంభవిస్తే పంట పూర్తిగా నాశనమవుతుంది. ఇదంతా తెలిసినా రైతు మాత్రం నేల తల్లిని నమ్ముకుని వ్యవసాయమే చేస్తున్నాడు. కానీ ఆ రైతన్నకు మాత్రం 'సాయం'అందడం లేదు. పంద్రాగస్టుకి రుణమాఫీ అవుతుం దనుకుని ఎదురు చూసిన రైతన్నల ఆశలు ఆవిరవుతున్నాయి. అర్హుల జాబితాలో వారి పేర్లు లేకపోవడంతో గుండెలవిసేలా ఏడ్చారు. సారు రుణమాఫీలో నా పేరు రాలేదంటూ అధికార, విపక్ష నేతల వద్ద వారి వేదనను నివేదించుకున్నారు.

- రూ.3.56కోట్ల రుణాలకు కేవలం రూ.35 లక్షలు మాత్రమే మాఫీ
- మొత్తం 741 రైతులు లోన్ తీసుకోగా 79 మంది మాత్రమే అర్హులు
- 662 మంది రైతుల ఎదురు చూపులు

దుండిగల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో హంగు ఆర్భాటాలతో రైతు రుణ మాఫీ చేశామని ఒక వైపు గొప్పలు చెప్పుకుంటుంది. కానీ క్షేత్ర స్థాయిలో మాత్రం అమలు కాలేదు. వందలో ఒకరిద్దరికి మాత్రమే రుణమాఫీ చేసి మిగతా వారికి కొర్రీలు పెట్టింది. అర్థం పర్థం లేని కారణాలను చూపుతూ రైతు రుణమాఫీకి అనర్హులని తేల్చింది. దీంతో వందలాది మంది అన్నదాతలు రైతు రుణమాఫీకి నోచుకోలేకపోయారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బౌరంపేట, దూలపల్లి ప్రాంతాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్) ఉండగా అందులో వందలాది మందికి రైతు రుణమాఫీ జరగలేదు. మొత్తం 2,793 మంది రైతులు ఉండగా వారిలో 741 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. మొదటి విడతలో 62 మంది, రెండో విడతలో 12, మూడో విడతలో నలుగురికి మాత్రమే రుణమాఫీ అయ్యింది. మొత్తం రూ.3,56,60,617 కోట్ల రుణమాఫీ కావాల్సి ఉండగా అందులో కేవలం రూ.35,67,250 లక్షలు మాత్రమే మాఫీ అయ్యింది.

బౌరంపేట పీఏసీఎస్ పరిధిలో..

బౌరంపేట్ సహకార బ్యాంకు పరిధిలో 13 గ్రామాల్లో 2,364 రైతులు ఉన్నారు. అందులో 632 మంది రైతులు మాత్రమే పంట రుణాలు తీసుకున్నారు. వీరిలో మొదటి విడతగా 11మంది రైతులకు రూ.2,76,478 లక్షలు రుణమాఫీ కాగా, రెండో విడతల ఒకరికి రూ.40 వేలు, మూడో విడతలో కేవలం ఇద్దరు రైతులకు రూ.1,23, 633 లక్షలు రుణమాఫీ పొందారు. ఇంకా 618 మంది రైతులకు రూ. 2,95,32,952 కోట్ల రూపాయలు రావాల్సి ఉంది.

దూలపల్లి పీఏసీఎస్ పరిధిలో..

దూలపల్లి సహకార బ్యాంకులో కొంపల్లి, బహదూర్ పల్లి, దూలపల్లి గ్రామాల్లో 429 రైతులు ఉండగా, అందులో 109 మంది రైతులు మాత్రమే క్రాప్ లోన్ తీసుకున్నారు. 109 మంది రైతులకు రూ. 57,95,061 లక్షల క్రాప్ లోన్ తీసుకున్నారు. వీరిలో మొదటి విడతగా 51 మంది రైతులకు గాను రూ. 19,67,317 లక్షలు రుణమాఫీ కాగా, రెండో విడతలో 12 మంది రైతులకు రూ. 10,07,918 లక్షలు రుణమాఫీ అయింది. మూడో విడతలో కేవలం ఇద్దరు రైతులకే రూ. 1,62,741 లక్షల రుణమాఫీ పొందారు. ఇంకా 44 మంది రైతులకు రూ. 25,58,415 రూపాయలు రావాల్సి ఉంది.



బ్యాంక్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్ (ఫైల్)

భారీ ఆందోళనకు సిద్ధం...

కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని బౌరంపేట్, దూలపల్లి సహకార సంఘాల బ్యాంకు పరిధిలో ఉన్న రైతులు త్వరలోనే భారీ ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే మూడు విడతల్లో వచ్చిన రుణమాఫీ జాబితాలో తమ పేర్లు గల్లంతు కావడంపై ఆగ్రహంతో ఉన్నారు. 600 పైగా ఉన్న రైతులు ఎంతో ఆశగా ఎదురుచూసిన వారికి నిరాశే ఎదురైంది. దీంతో ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలిసి అధికారులకు వినతి పత్రాలు సమర్పించి తమకు కూడా రుణమాఫీ చేయాలని కోరుతూ ఆందోళన చేసిన విషయం తెలిసిందే. మరో వారం రోజుల్లో భారీ కార్యాచరణ రూపొందించుకుని ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

మాట ఇచ్చినప్పుడు అందరికీ రుణ మాఫీ చేయాలి. ఐటి చెల్లించే వాళ్లు, ప్రభుత్వ ఉద్యోగులు ఉంటే వారిని మినహాయిస్తే ఒప్పుకుంటాం. కానీ పంట పండించే సామాన్య రైతులకు మాత్రం రైతు రుణమాఫీ చేయకపోవడం బాధాకరం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి రైతులందరికీ రుణమాఫీ చేయాలి.

– మిద్దెల బాల్‌రెడ్డి, బౌరంపేట పీఏసీఎస్ చైర్మన్

రుణమాఫీ కాలేదు..



నాకు రెండు ఎకరాల పొలం ఉంది. అందులో వరి సాగు చేస్తున్నా. నేను రూ.80 వేలు రుణం తీసుకున్నా. మూడు విడతల్లో కూడా నాకు రుణ మాఫీ కాలేదు. గతంలో కేసిఆర్ ఉన్నప్పుడు రుణమాఫీ జరిగింది. ఇప్పుడు రేవంత్‌రెడ్డిని నమ్మి ఓటు వేస్తే మాకు న్యాయం జరగలేదు. ఇప్పటికే పంటలో మందులు వేయాలి. కూలీలకు డబ్బులు చెల్లించాలి. డబ్బులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

– కృష్ణారెడ్డి, రైతు, దుండిగల్

గతంలో అయ్యింది.. ఇప్పుడు కాలే..



గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు రూ.50 వేలు రుణం తీసుకుంటే రుణ మాఫీ జరిగింది. మరో సారి రూ.80 వేలు రుణం తీసుకున్నా. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో రుణమాఫీ కాలేదు. నాకు 2.10 ఎకరాల స్థలం ఉంది. వరి పంటతో పాటు పాల వ్యాపారం చేస్తున్నా. అధికారులను అడిగితే నా ఆధార్ కార్డు నెంబరు కొడితే వేరే వాళ్ల పేరు వచ్చిందని, అందుకే రుణ మాఫీ కాలేదని చెప్తున్నారు. గతంలో మాఫీ అయితే ఇప్పుడు ఎందుకు కావడం లేదు.

– బాల్‌రెడ్డి, రైతు, బౌరంపేట

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు



బాచుపల్లిలో జరిగిన బోనాల వేడుకల్లో మేయర్ నీలారెడ్డి, కార్పొరేటర్ బాలాజీ నాయక్

నిజాంపేట్: బోనాల పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని 15, 16 డివిజన్లల్లోని ముత్యాలమ్మ ఆలయం, నల్లపోచమ్మ ఆలయం, ఎస్సీ కాలనీలోని పోచమ్మ ఆలయాల్లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ బాలాజీ నాయక్‌తో కలిసి మేయర్ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ బాచుపల్లి ఎస్సీ కాలనీలో బోనాల ఉత్సవాల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి, కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు కొలన్ జీవన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నారాయణ, జీతాయ్య, రాజేందర్, భూపాల్, గోవర్ధన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ, సీసీరోడ్డు పనులు ప్రారంభం



బహదూర్‌పల్లిలో పనులను ప్రారంభిస్తున్న దుండిగల్ మున్సిపల్ వైస్‌చైర్మన్ పద్మారావు

సుభాష్‌నగర్: అభివృద్ధి పనుల్లో కాలనీలోని సంక్షేమ సంఘం కలిసికట్టుగా పనిచేయాలని దుండిగల్ మున్సిపల్ వైస్‌చైర్మన్ తుడుం పద్మారావు అన్నారు. దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లి 14వ వార్డు గ్రీనిహిల్స్‌కాలనీలో రూ.50లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులను ఆదివారం వైస్‌చైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరై కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ... పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కాలనీలో మిగిలి ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమర్నాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రయ్య, దామోదర్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలి



నిజాంపేట్: సంక్షేమ సంఘాలు స్థానిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్‌నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం నిజాంపేట్ రాజీవ్‌గృహకల్ప మదర్ థెరిస్సా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పితాని శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా మానేపల్లి నరసింగరావు, ఉపాధ్యక్షుడిగా పోచారం ప్రభాకర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ ఎర్ర దాలినాయుడు, ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా ముంగండ వెంకటేశ్వరరావు, ట్రెజరర్‌గా అద్దంకి శ్రీనివాసరావు, జాయింట్ ట్రెజరర్‌గా పోతుల శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ సలాడి శివ, ఆర్గనైజింగ్ సెక్రటరీ అత్తోట నాగభూషణం, కో–ఆర్డినేటర్లుగా పల్లె శ్రీనివాసరావు, డెక్కపాటి బుజ్జి, మూర్తి తదితరులు ఎన్నికయ్యారు. నూతన కమిటీని శ్రీనివాస్‌రెడ్డి సత్కరించి రాజీవ్‌గృహకల్ప ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

పల్లె బాట

సుభాష్‌నగర్: రాఖీ పండుగను పురస్కరించుకొని వరుసగా రెండు రోజులు సెలవు దినాలు రావడంతో చాలామంది నగరం నుంచి పల్లె బాట పట్టారు. ఆదివారం నగరం నుంచి జిల్లాల వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసి పోయాయి.

సుచిత్రలో..



రాఖీహారం



రంగారెడ్డినగర్: రాఖీ పండుగను పురస్కరించుకుని ఆదివారం రంగారెడ్డినగర్ డివిజన్ నందానగర్‌లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో వేడుకలు నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో జరిగే వేడుకల్లో చిన్నారులు రాఖీలు కడుతూ సందడి చేశారు. రాఖీ ఆకృతితో చిన్నారుల మానవహారం ఆకట్టుకుంది.. రాఖీ విశిష్టతను తెలిపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయండి



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు వినతి పత్రం అందజేస్తున్న కేపీఎల్ బాబు

దుండిగల్: బాచుపల్లి నుంచి బౌరంపేట వరకు రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రణీత్ ప్రణవ్ బ్లూమ్స్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసి వినతి పత్రం అందజేశారు. రోడ్డు విసర్తణ పనులు నత్తనడకన సాగుతుండడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పనులను పూర్తి చేయించాలన్నారు. అదే విధంగా బౌరంపేటలోని పలు ప్రాంతాల నుంచి మురుగు నీరు చెరువుల్లో కలవకుండా ప్రత్యేక పైపులైన్లను ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి శంభీపూర్ రాజు సానుకూలంగా స్పందించారు. అసోసియేషన్ ట్రెజరర్ కేపీఎల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జామ్ కాకుండా పనులు పూర్తిచేయండి

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. అల్వాల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్మార్ట్ బజార్, కొంపల్లి మున్సిపల్ పరిధి ఎస్ఎన్ఆర్ గార్డెన్స్, టీఎన్ఆర్ క్లాంపెక్స్ తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న సీవరేజీ పైపులైన్‌లను ఆదివారం అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు, కుత్బుల్లాపూర్ సర్కిల్ ఏఈ సురేందర్‌నాయక్, అల్వాల్ డీఈ రఘు, కొంపల్లి డీఈ నరేష్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. ట్రాఫిక్‌కు ఆటంకం కలుగకుండా పనులను త్వరితగతిన పూర్తిచేసేలా ఆయా శాఖల అధికారులు సహకరించాలని ఏసీపీ వెంకట్‌రెడ్డి కోరారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

జగద్గిరిగుట్ట: పశ్చిమ బెంగాల్ కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలు మౌమితను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు ఏసురత్నం, నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేశ్‌లు అన్నారు. జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయని అన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు సంఘటనలు జరిగినప్పుడు కఠినంగా వ్యవహరిస్తామని హామీలే ఇస్తున్నారని అమలు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐడబ్ల్యూ కార్యదర్శి హైమావతి, సత్యవతి, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, ఏఐటీయూసీ అధ్యక్షుడు హరినాథ్, సీపీఐ నాయకులు కృష్ణ, సహదేవ్‌రెడ్డి, చంద్రయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ జయంతి



గాజులరామారంలో పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, గౌడ సంఘం నేతలు



పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్



ప్రగతినగర్‌లో పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



దేవేందర్‌నగర్‌లో శ్రీనూతన గౌడ సంఘం ఆధ్వర్యంలో..



భగత్‌సింగ్‌నగర్‌లో పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్, నాయకులు

నిజాంపేట్: మొగలుల సామ్రాజ్యవాదాన్ని ఎదురించి బహుజనులకు రాజ్యాధికారాన్ని అందించేందుకు పోరాడిన తొలి బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని వక్తలు కొనియాడారు. పాపన్నగౌడ్ 374వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ప్రగతినగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఓ సామాన్య కుటుంబంలో జన్మించిన ఆనాటి ఆధిపత్య కులాల అధికారానికి వ్యతిరేకంగా పాపన్నగౌడ్ వీరోచిత పోరాటాలు సాగించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రగతినగర్ బీజేపీ అధ్యక్షుడు నరేంద్ర చౌదరి, మల్కాజ్గిరి పార్లమెంట్ కో కన్వీనర్ డాక్టర్ ఎం.ఆర్.ఎస్.రాజు, బీజేపీ ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డి, బాచుపల్లి బీజేపీ అధ్యక్షుడు ప్రసాద్ రాజు, ప్రగతి నగర్ బీజేపీ ప్రధాన కార్యదర్శులు సంతోష్ గౌడ్, అశోక్, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి రవియాదవ్, ఉపాధ్యక్షులు మదన్‌గౌడ్, సత్యనారాయణ, శ్రీధర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

◆ గోల్కొండ కోటను ఏలిన చక్రవర్తి

చింతల్: తెలంగాణ చరిత్రలో మొదటిసారిగా గోల్కొండ కోటను ఏలిన ఏకైక బహుజన హిందూ చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న అని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బుద్దా విజయశేఖర్‌గౌడ్ అన్నారు. పాపన్నగౌడ్ 374వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయశేఖర్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొగల్ దోపిడీ పాలనకు వ్యతిరేకంగా పోరాడి అణగారిన వర్గాలను ఏకం చేసి గోలకొండ కోటను కోటను ఏలిన మహనీయుడు పాపన్న మహారాజ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తంగా లక్ష్మారెడ్డి, భగత్‌సింగ్‌నగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సత్యం, సాంబయ్య, సామ్రాట్ గౌడ సంఘ అధ్యక్షుడు బబ్బూరు బిక్షపతిగౌడ్, ఉపాధ్యక్షుడు బీసు వెంకటేశంగౌడ్ బాల్నే రమేష్‌గౌడ్, పచ్చిమట్ల నరేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

◆ రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో..

రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, రాష్ట్ర బీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్ సర్దార్ పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గీతా కార్మిక సెల్ కన్వీనర్ వెంకటేష్‌గౌడ్, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు రంగా శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ మొగలుల దురాక్రమణ నుంచి కాపాడిన వీరుడు

సుభాష్‌నగర్: మొగలుల దురాక్రమణ నుంచి తెలంగాణ ప్రజలను కాపాడిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకుని ఆదివారం గాజులరామారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు. పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన బహుజనుల అభ్యున్నతికి చేసిన కృషిని, త్యాగనిరతిని ప్రస్తుతించారు. ఈ కార్యక్రమంలో కూన అంతయ్యగౌడ్, కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్, కూనా రాఘవేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, బుచ్చిరెడ్డి, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా దేవేందర్‌నగర్‌లో శ్రీనూతన గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పించారు.

ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన వారిని గౌరవించాలి



షాపూర్‌నగర్ ఉషోదయ టవర్స్ వద్ద సమావేశమైన టీజేఎస్ నాయకులు

కుత్బుల్లాపూర్: తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన వారిని రాష్ట్ర ప్రభుత్వం గౌరవించాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ టీజేస్ అధ్యక్షుడు ముదిరెడ్డి అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం షాపూర్‌నగర్‌లోని ఉషోదయ టవర్స్ వద్ద ఉద్యమకారులు అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉద్యమకారులను గత ప్రభుత్వం విస్మరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా వారికి సముచిత స్థానం కల్పించాలన్నారు. ఉద్యమంలో అరెస్ట్ అయిన వారందరిని తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధులుగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. 250 గజాల ఇళ్ల స్థలం, పింఛన్, ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇవాలన్నారు. ఈ సమావేశంలో ఉద్యమకారుల ఫోరం చైర్మన్ చీమ శీనివాస్, నాయకులు సురేందర్ రెడ్డి, సూరం నరసింహులు, నాగిరెడ్డి, రామిరెడ్డి, సాయిరెడి, శ్రీను, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.